క్లుప్తంగా

చేనేత సమస్యలు పరిష్కరించాలని వినతి

సంస్థాన్ నారాయణపురం: చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి పద్మశాలి చేనేత కార్మికులు సోమవారం హైదరాబాద్‌లో వినతిపత్రం అందించారు. వస్త్రాల అమ్మకం జరగడం లేదని, త్రిఫ్ట్, చేనేత పథకాలు అందక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్ళినారు. వినతి పత్రం అందజేసిన వారిలో చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు చెరుపల్లి లక్ష్మయ్య, పద్మశాలి యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు విడం సాయికిషోర్, సింగం కృష్ణ ,గుర్రం సత్యనారాయణ, గంజి అంజయ్య, దోర్నాల కృష్ణబాబు, సింగం భాస్కర్, సంగిశెట్టి నరేష్, చేనేత సహకార సంఘం ఇన్‌చార్జి కుర్రం సత్యనారాయణ తదితరలున్నారు.

నిధులు కేటాయించాలి

మోత్కూరు: కేంద్ర బడ్జెట్‌లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి రూ.2.70 లక్షల కోట్ల నిధులు కేటాయించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బొల్లు యాదగిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మోత్కూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు రాచకొండ రాములమ్మ, గుండు లక్ష్మి, కందుకూరి నరసింహ, అలివేలు, యాదమ్మ పాల్గొన్నారు.

మార్కెట్ రేట్ ప్రకారం పరిహారం ఇవ్వాలి

యాదగిరిగుట్ట రూరల్: ఔటర్ రింగ్ రోడ్డులో నష్టపోతున్న భూములకు మార్కెట్ రేట్ ప్రకారం నష్టపరిహారం అందజేయాలని యాదగిరిగుట్ట మండలం దాతర్‌పల్లి గ్రామంలోని బాధితులు సోమవారం తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినితి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కాల్నె అయిలయ్య, బత్తిని రామక్రిష్ణ, కాల్నె భాస్కర్, రాంపల్లి చంద్రయ్య, కర్రె సిద్దిరాజ, వెంకటయ్య, చెన్రాజ్ శేఖర్, మహేష్ పాల్గొన్నారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

మోటకొండూర్: ఈ నెల 28వ తేదీ వరకు డిజిటల్ సంతకం అయిన పట్టాదారు రైతులు రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సుబ్బూరి సుజాత తెలిపారు. సోమవారం మోటకొండూర్ మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద రైతు బీమా దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు. రైతులు పట్టాదారు పాస్ బుక్, ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డ్, అప్లికేషన్ ఫారం జిరాక్స్‌లు రైతు వేదికల వద్ద ఏఈఓలకు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సంధ్య, రైతులు చిర్ర రవీందర్, భూమండ్ల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కస్తూరి ఫౌండేషన్ చేయూత

సంస్థాన్ నారాయణపురం: మండలంలోని పుట్టపాక ప్రాథమిక, జెడ్పీ పాఠశాలల్లోని 305 మంది విద్యార్థులకు సోమవారం కస్తూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నోటు, గ్రామర్ పుస్తకాలు డిక్షనరీలు, బ్యాగ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కస్తూరి ఫౌండేషన్ ప్రతినిధి నరేందర్‌రెడ్డి, పాఠశాల పూర్వ విద్యార్థి సీనియర్ జర్నలిస్ట్ మర్రి మహేందర్‌రెడ్డి, వీరమల్ల కార్తీక్, కొప్పు రామకృష్ణ, దొంతగాని పెద్దులు, వర్కాల చంద్రశేఖర్, పాఠశాల హెచ్ఎం హనుమంతు, లక్ష్మయ్య, పిట్ట రాములు, కొత్త శ్రీకాంత్ నడికుడి నరసింహ తదితరులున్నారు.

అనుమతులు నిలిపివేయాలి

చౌటుప్పల్: చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం గ్రామంలోని ఓ పరిశ్రమకు వలిగొండ మండలం నుంచి పైప్‌లైన్ ద్వారా నీటి తరలింపునకు అనుమతులు ఇచ్చి ఉంటే నిలిపివేయాలని ఆరెగూడెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ జాల మల్లేష్‌యాదవ్ కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ పి.బెన్‌షాలోమ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

డిగ్రీ కళాశాల, బస్ డిపో ఏర్పాటు చేయాలి

మోత్కూరు: మోత్కూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆర్టీసీ బస్ డిపో ఏర్పాటు చేయాలని సోమవారం మోత్కూరుకు వచ్చిన జిల్లా కలెక్టర్ హన్మంతు కే.జెండగేకు బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ గౌడ్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్‌కు పలు విషయాలు వివరించారు. కార్యక్రమంలో బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు కొయ్యలకారి నరేందర్, లాధినేని సోమేశ్వర్, బయ్యని రాజు, బుంగపట్ల యాకయ్య, సత్యనారాయణ ఉన్నారు.

గ్రంథాలయం ఏర్పాటు



పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

బొమ్మలరామారం: మండలంలోని మల్యాల గ్రామంలో గల కేజీబీవీలో విద్యార్థుల సౌకర్యార్థం మహిళా శిశు వికలాంగులు, సీనియర్ సిటిజన్ విభాగం ద్వారా సోమవారం గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జిల్లా మహిళ సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ హర్ష, జెండర్ స్పెషలిస్ట్ భార్గవి, నిఖిత, స్పెషలిస్ట్ ఇన్ ఫైనాన్షియల్ డ్రెసింగ్ మనీషా, కేజీబీవీ ప్రత్యేకాధికారి లక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎనిమిది నెలల్లో ఏం తెచ్చారు?



ఏకపక్షంగా నిధులు కేటాయించడంపై నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ కౌన్సిలర్లు



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, పక్కన కమిషనర్

- పైసా కూడా తీసుకురాలేదు
- మా పాలనలో ప్రారంభించిన పనులకే కొబ్బరికాయలు కొట్టారు
- బీఆర్ఎస్ కౌన్సిలర్ల ఆగ్రహం
- వాడివేడిగా భువనగిరి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

భువనగిరిటౌన్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలు కావస్తున్నా పట్టణ అభివృద్ధికి పైసా తేలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులకే కొబ్బరికాయలు కొట్టారు.. అని బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం చైర్మన్ పోతంశెట్టి అధ్యక్షతన జరిగిన భువనగిరి మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం వాడివేడిగా సాగింది. సమావేశంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఏవీ కిరణ్‌కుమార్‌రెడ్డి, అజిమొద్దీన్, చింతల కిష్టయ్య మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అర్బన్‌కాలనీలో అండర్‌పాస్ కోసం రూ. 27లక్షలు, హౌజింగ్‌బోర్డులో డ్రెయినేజీ నిర్మాణానికి కోటి రూపాయాల కేటాయించారని గుర్తుచేశారు. ఆ పనులకే ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ పాలకవర్గం కొబ్బరి కాయలు కొట్టారు తప్పా.. కొత్త ఒక్క పని చేపట్టలేదన్నారు. పట్టణ అభివృద్ధిలో పాలకవర్గం విఫలమైందని విమర్శించారు. అంతేకాకుండా జనరల్ ఫండ్ నిధులు కేటాయింపులో అన్యాయం జరిగిందంటూ పోడియం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. పన్నుల రూపంలో సమకూరిన జనరల్ ఫండ్‌ను ఏకపక్షంగా ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. అన్ని వార్డులకు సమానంగా కేటాయించాల్సి ఉందన్నారు. చైర్మన్ కలుగజేసుకుని మరో కౌన్సిల్ సమావేశంలో మిగిలిన వార్డులకు నిధులు కేటాయింపు చేస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. పట్టణంలో మౌలిక వసతులు కల్పించడంతో పాటు అన్ని వార్డుల్లో రూ.3 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు చైర్మన్ తెలిపారు.

సమాచారం ఇవ్వడం లేదు

అధికార పార్టీ ఎమ్మెల్యే, చైర్మన్ వార్డు పర్యటనకు వచ్చిన సమయంలో స్థానిక కౌన్సిలర్లకు సమాచారం ఇవ్వడం లేదని సభ్యులు కడారి ఉమాదేవి, కుసంగుల ఎల్లమ్మ ఆరోపించారు. వార్డు ప్రథమ పౌరులుగా ఉన్న తమకు అవమానంగా ఉందని, పదవులకు రాజీనామా చేయమంటే చేస్తామన్నారు. అనంతరం పలువు అధికార, విపక్ష పార్టీల కౌన్సిలర్లు దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని, తదితర సమస్యలపై మాట్లాడారు.

37 ఎజెండా అంశాలు ఆమోదం

ఎజెండాలో పొందుపర్చిన 37 అంశాలపై సమావేశంలో చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించారు. తైబజార్ వసూలు కోసం అనుమతి ఇచ్చారు. ఆర్‌బీనగర్‌లో కమాన్ రోడ్డు సమస్య పరిష్కారం కోసం ల్యాండ్ అక్విడేషన్ చేయడానికి తీర్మానం చేశారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రామాంజుల రెడ్డి, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

అమరావతి మృతి బీఆర్ఎస్‌కు తీరనిలోటు

గుండాల: మాజీ ఎంపీపీ తాండ్ర అమరావతి మృతి బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత అన్నారు. ఇటీవల గుండెపోటుతో మరణించిన గుండాల మండలం మరిపడగ గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ తాండ్ర అమరావతి ఇంటికి వెళ్లి ఆమె చిత్రపటానికి సునీతామహేందర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఆమె వెంట టెస్కాబ్ మాజీ వైస్ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, హెచ్‌డబ్ల్యూసీఎస్ చైర్మన్ దుడుక ఉప్పలయ్య, రామకృష్ణారెడ్డి, సోమనర్సింహారెడ్డి, గడ్డమీది పాండరి, దుంపల శ్రీనివాస్, ఎండీ.కలీల్, కె.రాములు, తాండ్ర శోభన్‌బాబు ఉన్నారు.



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే సునీత

ఉపాధ్యాయులకు సన్మానం

రామన్నపేట: మండలంలోని కక్కిరేణి ఉన్నత పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, నరసింహ, సైదులును సోమవారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం హనుమంతరావు, ఏఎంసీ చైర్మన్ చిల్ల ప్రభావతి, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం బి.ఉపేందర్‌జీ, ఉపాధ్యాయులు ప్రద్యుమ్నాచారి, భద్రయ్య, రాజన్‌బాబు, శేఖర్‌రెడ్డి, శ్రీనివాసరావు గ్రామపెద్దలు పిట్ట రాంరెడ్డి, సోమేశ్వర్‌రావు, చిల్ల శ్రీనివాస్, వేముల సైదులు పాల్గొన్నారు.

స్మితా సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలి

రామన్నపేట: వికలాంగులను కించపరిచే విధంగా ట్విట్టర్‌లో పోస్ట్‌చేసిన ఐఏఎస్ అధికారి స్మితాసబర్వాల్‌పై ప్రభుత్వం శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని జాతీయ వికలాంగుల హక్కుల వేదిక జిల్లా కార్యదర్శి వనం ఉపేందర్ డిమాండ్ చేశారు. స్మితాసబర్వాల్ వ్యాఖ్యలను ఖండిస్తూ సోమవారం రామన్నపేటలో ఎన్‌పీఆర్డీ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగుల మనోభావాలను దెబ్బ తీసేవిధంగా వ్యవహరించిన స్మితాసబర్వాల్ వెంటనే క్షమాపణ చెప్పాలన్నారు. కార్యక్రమంలో మండలఅధ్యక్షుడు బల్గూరి ఆంజనేయులు, గిరకల లింగస్వామి, కోనూరు వెంకటేశం, గట్టు చంద్రయ్య, పల్సం పరశురాం, చంద్రమౌళి, ఉమాకాంతం, చిందం ఉమాకాంతం, పున్న దత్తాద్రి పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలకు రూ.18వేలు ఇవ్వాలి



ధర్నా చేస్తున్న ఆశా కార్యకర్తలు, నాయకులు

భువనగిరిటౌన్ : కనీస వేతనం విషయంలో ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆశా కార్యకర్తలు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. వారికి సీఐటీయూ నాయకులు మద్దతు ప్రకటించి మాట్లాడారు. ఆశా కార్యకర్తలకు కనీస వేతనం నెలకు రూ.18,000 చెల్లిస్తామని చెప్పి ఇప్పటి వరకు అమలుచేయడం లేదన్నారు. కనీస వేతనం రూ.18 వేలు నిర్ణయించి చెల్లించడంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 9వ తేదీ వరకు 15 రోజుల పాటు ఆశా కార్యకర్తలు చేసిన సమ్మె కాలానికి వేతనం ఇవ్వాలని కోరారు. అనంతరం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కసగోని లలిత, ఉపాధ్యక్షురాలు రంగ సంతోష, కోశాధికారి పుష్ప తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె చేస్తాం

భువనగిరి: తమ సమస్యలు పరిష్కరించకపోతే ఈనెల 29నుంచి సమ్మె చేపడుతామని జిల్లా కేంద్ర ఆస్పత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ సిబ్బంది, సెక్యూరిటీ గార్డులు స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ ఇమ్రాన్‌తో కలిసి అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్‌కు సమ్మె నోటీసు అందజేశారు. జీఓ నంబర్ 60 ప్రకారం పెంచిన వేతనాలు అమలు చేయాలని, కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు సామల శోభన్ బాబు, శానిటేషన్ కార్మికులు రాచకొండ పుష్ప, జేరిపోతుల కమలమ్మ, ఇస్తారమ్మ, సులోచన తదితరులు పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి

- బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్
- తహసీల్దార్ కార్యాలయాల్లో వినతులు అందజేత



చౌటుప్పల్ : ధర్నాలో మాట్లాడుతున్న ఆనంద్‌గౌడ్

సాక్షి, నెట్‌వర్క్: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీ డిక్లరేషన్ అమలు జాప్యాన్ని నిరసిస్తూ బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో సోమవారం చౌటుపపల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి మాట్లాడారు. అలాగే భువనగిరి, రామన్నపేట, మోత్కూరు, పోచంపల్లి, వలిగొండ, యాదగిరిగుట్ట రూరల్, రాజాపేట, బొమ్మలరామారం, మోటకొండూర్, ఆత్మకూరు(ఎం), సంస్థాన్‌నారాయణపురం మండలాల్లోని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహించి తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు వినతి పత్రాలు అందజేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో జరిగిన ఈ కార్యక్రమాల్లో బీజేపీ, ఆ సంఘం రాష్ట్ర, జిల్లా, పట్టణ, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



భువనగిరి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఓబీసీ మోర్చా నాయకులు



యాదగిరిగుట్టలో..



భూదాన్‌పోచంపల్లిలో..

ఘనంగా దాశరథి జయంతి

మోత్కూరు, వలిగొండ: మహాకవి డాక్టర్ దాశరథి కృష్ణమాచార్యులు జయంతిని సోమవారం మోత్కూరు జెడ్పీహెచ్ఎస్, వలిగొండ గాయత్రి ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మోత్కూరు ప్రజా భారతి అధ్యక్షుడు దేవినేని అరవిందరాయుడు, ప్రజా భారతి ప్రధాన కార్యదర్శి గుమ్మడెల్లి వెంకన్న, కోశాధికారి గాదె వెంకటేశ్వర్లు, ప్రతినిధులు బోళ్ల హన్మంతు, టి.ఉప్పలయ్య, కోమటి మత్స్యగిరి, బయ్యని రాజు, సజ్జనం మనోహర్, రాంప్రసాద్, జయశ్రీతోపాటు వలిగొండలో పాఠశాల సిబ్బంది అనురాధ, రెబ్బ మల్లికార్జున్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



మోత్కూరులో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

ముగిసిన బోనాల ఉత్సవం

చౌటుప్పల్: మండలంలోని దండుమల్కాపురం గ్రామ శివారులోని శ్రీఆంథోల్‌మైసమ్మ దేవాయలంలో కొనసాగుతున్న వార్షిక బోనాల ఉత్సవం (బ్రహ్మోత్సవాలు) సోమవారం ముగిశాయి. చివరిరోజున ఆలయ ఈఓ ఎస్.మోహన్‌బాబు ఆధ్వర్యంలో పూజలు, హోమం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు చిలుకూరి మల్లారెడ్డి, బుర్ర స్వామి, రమేష్, శ్రీహరి, జంగయ్య, విజయ్, గణేష్, అంజిరెడ్డి, రవీందర్, కంచర్ల ప్రవీణ్‌రెడ్డి, బాలగోని శ్రీకాంత్, అన్నదాన దాత విజయ్‌కుమార్, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



పూర్ణాహుతిలో పాల్గొన్న ఈఓ, భక్తులు

సంక్షిప్త సమాచారం

సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన ఉండాలి

బొమ్మలరామారం: ప్రజలందరికీ సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన ఉండాలని ఎస్ఐ రాఘవేందర్ గౌడ్ అన్నారు. బొమ్మలరామారం మండలం సోలీపేట్‌లోని ఇమ్మానుయల్ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన యాంటీ డ్రగ్స్, సైబర్ క్రైమ్‌లపై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పోలీసులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులివ్వాలని వినతి

ఆత్మకూరు(ఎం): మండల కేంద్రంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని మాజీ సర్పంచ్ జెన్నాయికోడె నగేష్ కోరారు. ఈ మేరకు సోమవారం ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యకు వినతి పత్రం అందజేశారు. దీనికి ఎమ్మెల్యే స్పందించి ఎస్‌డీఎఫ్ నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చినట్లు నగేష్ తెలిపారు.

ఆలేరులో పారిశుద్ధ్య చర్యలు

ఆలేరు రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని బీసీ కాలనీ, బుడగ జంగాల కాలనీ, 7వ వార్డు, పలు కాలనీల్లోని సోమవారం మున్సిపల్ సిబ్బంది మురుగు కాల్వలను శుభ్రం చేసి వాటి వెంట పెరిగిన గడ్డిని తొలగించారు. మోరీల వెంట బ్లీచింగ్ పౌండర్ చల్లారు. సీజనల్ వ్యాధుల ముప్పు పొంచి ఉన్నందున్న కమిషనర్ ఆదేశాలతో పారిశుద్ధ్య చర్యలు చేపట్టామని సిబ్బంది తెలిపారు.

రైతులందరికీ రుణమాఫీ చేయాలి

బొమ్మలరామారం: అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని బొమ్మలరామారం పీఏసీఎస్ చైర్మన్ గూదె బాల్‌నర్సింహ అన్నారు. బొమ్మలరామారంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పీఏసీఎస్‌లో 835 మంది రైతులకు 587 మందికి మాత్రమే రుణమాఫీ జరిగిందన్నారు. సమావేశంలో కొండోజు అంజనేయులు, గుండ్లపల్లి వెంకటేష్ గౌడ్, జూపల్లి భరత్‌కుమార్, ఇస్లావత్ భాస్కర్,శ్రీనివాస్ పాల్గొన్నారు.

మొబైల్ షాపుల్లో చోరీ

భువనగిరి క్రైం: పట్టణంలోని బస్టాండ్ సమీపంలో గల మొబైల్ షాపుల్లో ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. సోమవారం ఉదయం షాపు యజమానులు వచ్చేసరికి రెండు దుకాణాల షట్టర్లు లేపి ఉండడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. దాదాపు రూ.30లక్షల విలువైన మొబైల్ ఫోన్లు, ఇతర సామగ్రి చోరీఇకి షాపు యజమానులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ సురేష్ కుమార్ తెలిపారు.

మోత్కూరును ఆదర్శంగా తీర్చిదిద్దుతా



మోత్కూరులో స్వచ్ఛ ఆటోలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్



అడ్డగూడూరు : కంచనపల్లి కేజీబీవీలో బియ్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

- తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్
- కలెక్టర్‌తో కలిసి స్వచ్ఛ ఆటోలు, సీసీ కెమెరాలు ప్రారంభించిన ఎమ్మెల్యే

మోత్కూరు: మోత్కూరు మున్సిపాల్టిని ఆదర్శ మున్సిపాల్టిగా తీర్చిదిద్దుతానని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. నూతనంగా కొనుగోలు చేసిన రెండు స్వచ్ఛ ఆటోలు, ఒక ట్రాక్టర్ ట్రాలీని సోమవారం జిల్లా కలెక్టర్ హన్మంతు కే జెండగేతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. అనంతరం మోత్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే సామేల్ తన సొంత ఖర్చుతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను జిల్లా కలెక్టర్ హన్మంతు కే.జెండగేతో కలిసి సోమవారం ప్రారంభించి మాట్లాడారు. తాను ఇదే పాఠశాలలో చదుకుని ప్రస్తుతం ఎమ్మెల్యేగా పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమాల్లో డీఈఓ ప్రశాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవిత, సింగిల్‌విండో వైస్ చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు, జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం తీపిరెడ్డి గోపాల్‌రెడ్డి, పాఠశాల కమిటీ చైర్మన్ దబ్బెటి శైలజ, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ గుర్రం లక్ష్మినర్సింహారెడ్డి, వైస్ చైర్మన్ బొల్లేపల్లి వెంకటయ్య, కమిషనర్ సి.శ్రీకాంత్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అఖిలపక్షం నాయకులు అవిశెటి అవిలుమల్లు, బొల్లు యాదగిరి, అన్నెపు వెంకట్, పేలపూడి సత్యనారాయణ, పోచం సోమయ్య, కొణతం నాగార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

అడ్డగూడూరు: ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్యార్థుల ఉన్నతికి పాటుపడాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. సోమవారం అడ్డగూడూరు మండలం కంచనపల్లిలోని కేజీబీవీని కలెక్టర్ హనుమంతు కే.జెండగేతో కలిసి సందర్శించి మాట్లాడారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. మానాయికుంటలోని మూసీ వాగుపై చెక్ డ్యామ్ నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో జీసీడీఓ రాధ, ప్రిన్సిపాలల్ సరిత, తహసీల్దార్ శేశగిరిరావు, ఎంపీడీఓ శంకర య్య, ఎంపీఓ ప్రేమలత, సింగిల్ విండో చైర్మన్ కొప్పుల నిరంజన్, వైస్ చైర్మన్ చేడె చంద్రయ్య, నాయకులు పోలెబోయిన లింగయ్యయాదవ్, జోజి, సూర్యకిరణ్ పాల్గొన్నారు.

పరిశ్రమను మూసివేయాలని ధర్నా

చౌటుప్పల్: మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామ శివారులోని ఐఎన్ ఆగ్రోవిట్ పరిశ్రమను మూసివేయాలని డిమాండ్ చేస్తూ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్‌పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు సోమవారం రాత్రి ధర్నా నిర్వహించారు. పరిశ్రమలో పనిచేసే సిబ్బందిని బయటకు పంపించారు. ఘాటైన దుర్వాసన వస్తుండడంతో మాస్కులు ధరించి ప్రదాన ద్వారం ముందు బైఠాయించి ధర్నాకు దిగారు. పీసీబీ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎలాంటి ఆర్డర్‌లు తెచ్చుకున్నా ఇక్కడ మాత్రం పరిశ్రమను నడవనీయమన్నారు. కంపెనీని మూసివేసేందుకు స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ప్రజారోగ్యంతో చెలగాటమాడితే ఉపేక్షించం: ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

ధర్నా వద్దకు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వచ్చి తన సంఘీభావాన్ని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్యంతో చెలగాటమాడే పరిశ్రమలను ఉపేక్షించేది లేదన్నారు. పరిశ్రమ మూసివేత విషయాన్ని కలెక్టర్, ఇతర అధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. మండలంలో ఉన్న పరిశ్రమలను రెడ్, ఆరెంజ్, ఎల్లో కేటగిరీలుగా నిర్ణయించి కమిటీ వేయిస్తామని తెలిపారు. జల, వాయు కాలుష్యాన్ని వెదజల్లుతున్న పరిశ్రమలపై చర్యలు తీసుకుంటామన్నారు. ఇక్కడి పరిస్థితులను సీఎం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.



పరిశ్రమ గేటు ఎదుట ధర్నా చేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు, స్థానికులు

రామకృష్ణ కుటుంబానికి అండగా ఉంటాం

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

రామన్నపేట: ఇటీవల సిరిపురం గ్రామంలో హఠాన్మరణం చెందిన ఫొటోగ్రాఫర్ మిర్యాల రామకృష్ణ కుటుంబానికి అండగా ఉంటామని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. సోమవారం ఆయన సిరిపురం వెళ్లి రామకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం కాంగ్రెస్ గ్రామశాఖ సమకూర్చిన రూ.1.20లక్షల ఆర్థిక సాయం చెక్కును అందజేశారు. ఆయనవెంట మండలకాంగ్రెస్ అధ్యక్షుడు సిరిగిరెడ్డి మల్లారెడ్డి, నాయకులు పున్న జగన్మోహన్, గంగుల వెంకటరాజిరెడ్డి, సిరిగిరెడ్డి నర్సిరెడ్డి, అప్పం రామేశ్వరం, అప్పం గోయెల్, పున్న వెంకటేశం పాల్గొన్నారు.

చేనేత సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

చౌటుప్పల్: చేనేత కార్మికుల సమస్యలను అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు. డీసీసీబీ మాజీ డైరెక్టర్, నేలపట్ల చేనేత సంఘం అధ్యక్షుడు పిల్లలమర్రి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలువురు సోమవారం ఎమ్మెల్యేను కలిసిన సమస్యలు విన్నవించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యేను కలిసినవారిలో పోచంపల్లి చేనేత సంఘం మాజీ అధ్యక్షుడు భారత వాసుదేవ్, చేనేత సహకార సంఘాల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు అప్పం రామేశ్వరం ఉన్నారు.




చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

అభివృద్ధిని చూసి ఓర్వలేకే ఆరోపణలు

యాదగిరిగుట్ట: ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆలేరు నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత అసత్య ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. యాదగిరిగుట్ట పట్టణంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో ఆలేరు అభివృద్ధి కుంటుపడిందని ఆరోపించారు. మరోసారి విప్ ఐలయ్యపై అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదన్నారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షుడు బందారపు భిక్షపతి, గుండ్లపల్లి భరత్‌గౌడ్, హేమేందర్‌గౌడ్, నర్సింహగౌడ్, సలాం, పన్నీరు భరత్, రాంచందర్, కూరగాయల కృష్ణ, ఆకుల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికావు



మాట్లాడుతున్న కర్రె వెంకటయ్య

యాదగిరిగుట్ట: మాజీ మంత్రి కేటీఆర్‌పై ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఇటీవల చేసిన అనుచిత వ్యాఖ్యలు సరికాదని, వాటిని ఖండిస్తున్నామని బీఆర్ఎస్ పార్టీ యాదగిరిగుట్ట మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య అన్నారు. సోమవారం యాదగిరిగుట్టలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు సమయంలో ఒక్కరోజు కూడా జై తెలంగాణ అనని బీర్ల ఐలయ్య.. ఉద్యమ నేతలైన కేసీఆర్, కేటీఆర్‌లను నిందించడం సిగ్గుచేటన్నారు. గుట్ట సమీపంలో చేసిన స్విక్రా వెంచర్‌లో అక్రమాలు బయటకు వస్తున్నాయని, ఎంతో మంది అమాయకులు అందులో ప్లాట్లు కొని మోసపోయారన్నారు. స్విక్రా బాధితులతో యాదగిరిగుట్టలో త్వరలోనే ఆందోళన చేపడతామని, స్విక్రా బాధితులపై ఎమ్మెల్యే ఐలయ్య స్పందించాలన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతూ, పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తలుగా వ్యవహరిస్తున్నారన్నారు. సమావేశంలో పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి, జిల్లా నాయకులు మిట్ట వెంకటయ్య, పేరబోయిన సత్యనారాయణ, చిత్తర్ల బాలయ్య, కల్వకొలను సతీష్‌రాజ్, వాసం రమేష్, సయ్యద్ బాబా, ర్యాకల రాజు, తాళ్ల రాజేశ్వర్‌రెడ్డి, కన్న రాజు, చిట్యాల చిరంజీవి, నిమ్మనగోటి మల్లేష్, ఆకుల రాజేశేఖర్, బిట్టు వెంకటేష్, కుర్ర మధుకర్, ఎస్‌కే.అజీజ్, జే.గోపాల్ తదితరులున్నారు.

గీతకార్మికులకు ఎక్స్‌గ్రేషియా పెంచాలి

రాజాపేట: గీతకార్మికులకు ప్రమాద ఎక్స్‌గ్రేషియా రూ.10లక్షలకు పెంచాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొలగాని జయరాములు అన్నారు. సోమవారం రాజాపేట మండల కేంద్రంలో కల్లుగీత కార్మిక సంఘం మండల అధ్యక్షుడు పాండవుల లక్ష్మణ్ గౌడ్ అధ్యక్షతన నిర్వమించిన మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ మేనిఫెస్టో ప్రకారం కార్మికులకు ప్రమాద ఎక్స్‌గ్రేషియా రూ.5 లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచడంతోపాటు జిల్లాలో గాయిపడిన కార్మికల పెండింగ్ ఎక్స్‌గ్రేషియా వెంటనే చెల్లించాలన్నారు. కార్మికులకు ఉచితంగా సేఫ్టీ మోకులు అందజేయాలని, బ్యాంకుల ద్వారా రూ.2లక్షల సబ్సిడీ రుణం అందజేయాలన్నారు. ప్రతి సొసైటీకి 5 ఎకరాల భూమితోపాటు కార్మికులకు మోటార్ సైకిళ్లు అందజేయాలన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ గోపగాని బాలమణి యాదగిరిగౌడ్, ఎంపీపీటీసీ బుడిగె రేణుక పెంటయ్య గౌడ్, పాల సంఘం చైర్మెన్ భాస్కర్ గౌడ్‌లను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, ఉప్పలయయ, సంతోష్, కేదారి, బాలరాజు, గోపాల్, పాండు, బాబు, సిద్దులు, ప్రభాకర్, సత్యం, నర్సింహ్మ, వెంకటేష్, భిక్షపతి ఉన్నారు.



మాట్లాడుతున్న జయరాములు